
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.2

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

3

గురువారం 11 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.90 (121.5462)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.49 (2.67)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.42 (0.65)	50	నిల్

చికెన్ ధరలు లైవ్ : రూ.138 డ్రెస్ : రూ.210 స్కిన్‌లెస్ : రూ.240

- గత తప్పిదాలు పునరావృతం కావద్దని..
- ప్రయాణాలు సులభతరం కావాలని..
- ఏ ఒక్కరూ చనిపోవద్దని విన్నపం
- విస్తరణపై వెల్లువెత్తుతున్న ప్రజల సూచనలు
- అండర్‌పాసింగ్‌లు, బ్రిడ్జిలు, వీయూపీల కోసం డిమాండ్లు
- గ్రీన్ హైవేగా మార్చాలని సూచన

ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లే పరిష్కారం

ఆరు వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ● సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం



చిట్యాల మండలం వెలిమినేడు సమీపంలో ప్రమాదకర క్రాసింగ్

హైదరాబాద్ - విజయవాడ నగరాల మధ్య ఉన్న జాతీయ రహదారి డెత్ రోడ్‌గా మారింది. జాతీయ రహదారిని ఆరులేన్లుగా మార్చి ప్రమాదాలను నివారించాలని పలుమార్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించాను. ఆరు నెలల్లో ఆరులేన్లుగా మారబోతోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా కేవలం 2గంటల వ్యవధిలో చేరవచ్చు.

-కేతేపల్లిలో ట్రామాకేర్ సెంటర్ భూమిపూజ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి

దేశంలో రద్దీ రహదారిగా మారి నిత్యం నెత్తు రోడుతున్న అప్పటి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(9)ని 2009లో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించారు. దారి పెరిగినా రోడ్డుపై ప్రమాదాల దారుణాలు మాత్రం తగ్గ లేదు. వాహన రాకపోకలు పెరగడంతో పాటు నిర్మాణ సమయంలో సాంకేతిక సమస్యలతో పాటు స్థానికుల డిమాండ్లకు తలొగ్గి నిర్మాణం మార్చడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ తరుణంలో 15 ఏళ్ల తర్వాత మరోసారి వాహన రద్దీకి తగ్గట్టుగా ఈ మార్గాన్ని ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు ప్రణాళికలు కూడా రూపొందిస్తోంది. ఇందుకోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నిత్యన్ గడ్కరిని కలిసి పలుమార్లు విన్నవించారు. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణపై స్థానికుల అభిప్రాయాలు, అవసరాలు, అంచనాలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఎక్కడా రోడ్డు క్రాసింగ్ లేకుండా ఫ్లైఓవర్లు, అండర్ పాసింగ్‌లు, వీయూపీలు నిర్మించాలని కోరుతున్నారు. గతంలో జరిగిన తప్పులు జరుగకుండా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా ప్రమాదరహితంగా రహదారి నిర్మాణం చేపట్టాలని ఆశిస్తున్నారు.

వివరాలు 5లో

పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

సీనియర్ సివిల్ జడ్జి వీ.మాధవిలత



రికార్డులు తనిఖీ చేస్తున్న న్యాయమూర్తులు

భువనగిరి టౌన్, జూలై 10: పిల్లల సంరక్షణ కేంద్రాల నిర్వహణలో చట్టపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వీ.మాధవిలత అన్నారు. బుధవారం భువనగిరిలోని నిరీక్షణ చిల్డ్రన్స్ హోంను న్యాయమూర్తు లు, అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల సంరక్షణ, రక్షణ చట్టం 2015 పరిధి, నియమావళిని నిర్వాహకులు పాటించాలన్నారు. పిల్లల హక్కులను హరించరాదని, వారి భవిష్యత్‌కు, ఆలోచనలకు అవకాశాలు కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి సమగ్ర వివరాలను నమో దు చేయాల్సిందేనన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రికార్డులను, వసతులను పరిశీలించారు. జూనియర్ సివిల్ జడ్జి ఏ నాగేశ్వర్‌రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీసీపీవో పి సైదులు, పట్టణ ఇన్‌స్పెక్టర్ ఏ సురేష్‌కుమార్, డీసీపీయూ కేర్ టేకర్ అలివేలు తదితరులు బృందంలో ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఫిషరీస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్



చేపలు పడుతున్న మత్స్యకారులతో మాట్లాడుతున్న సాయికుమార్

భువనగిరి రూరల్, జూలై 10: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఫిషరీస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బుధవారం భువనగిరి శివారులోని రాయిగిరి చెరువులో మత్స్యకారులు చేపలు పట్టడాన్ని పరిశీలించి మాట్లాడారు. భువనగిరి జిల్లా కేంద్రంలో చేపల విక్రయానికి నూతన మార్కెట్ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా చేపపిల్లల పెంపకానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా పరిపుష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు సామల ధర్మరాజు, నాయకులు యాదగిరి, సామల రవీందర్, వెంకటేశ్, సత్యనారాయణ, కృష్ణ, సంజీవ, చంద్రయ్య, శివ, మల్లేశ్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి వద్దే మత్స్యశాఖ ఉండడం మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధకు నిదర్శనమని ఫిషరీస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన మత్స్యకార్మికుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. చేపల వేట, మార్కెటింగ్‌కు విస్తృత సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. సబ్సిడీతో ఉపకరణాలు, పట్టణాల్లో మార్కెట్ సముదాయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించే దిశగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, జిల్లా చీఫ్ ప్రమోటర్ సంజయ్ బాబు, డైరెక్టర్లు రవి శంకర్, కృష్ణ, శంకరయ్య, కుమార్, బోయిని ఝాన్సీ, గంగపుత్ర జిల్లా అధ్యక్షుడు గౌటి లక్ష్మణ్, మత్స్యపారిశ్రామిక సహకార సొసైటీ అధ్యక్షుడు నర్ల నర్సింగ్‌రావు, పూస అంజనేయులు, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.





జిల్లా యంత్రాంగం ఇక పాలనపై పట్టు బిగించనుంది. ఇన్నాళ్లు ఎన్నికలు, వాటి నిబంధనలతో పాలన అంతంత మాత్రంగానే సాగింది. అధికారులు కూడా ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో సంక్షేమ పథకాల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. అయితే ఎన్నికలు ముగియడంతో అధికార యంత్రాంగం సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేసింది. కలెక్టర్ హనుమంతు కే.జెండగే క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

పాలనపై పట్టు

- వరుస ఎన్నికలతో జిల్లా యంత్రాంగం బిజీబిజీ
- సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనల్లో కలెక్టర్ హనుమంతు జెండగే
- ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

వరుస ఎన్నికలతో జిల్లా యంత్రాంగం బిజీబిజీగా గడిపింది. అసెంబ్లీ, పార్లమెంట్‌తోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్లు వెనువెంటనే వెలువడటంతో పోలింగ్‌పైనే ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికలన్నీ కూడా పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే శాయశక్తులా కృషిచేశారు. జిల్లాలోని అధికారులందరీ సమన్వయంతో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోనే అత్యధిక శాతం ఓటింగ్ యాదాద్రి భువనగిరి జిల్లాలో నమోదైంది. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు భువనగిరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని 17నియోజకవర్గాల్లోనూ అత్యధిక శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వర్తించిన కలెక్టర్ పరిపాలనలోనూ తన మార్క్ ఉండాలని చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్‌గా తొమ్మిది నెలల క్రితం బాధ్యతలు తీసుకున్నారు. వరుస ఎన్నికలతో హడావుడిగా గడిపిన జిల్లా యంత్రాంగం.. ప్రస్తుతం పాలనపై పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన హనుమంతు కే.జెండగేకి కలెక్టర్‌గా ఇక్కడే మొదటి పోస్టింగ్. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.రెవెన్యూ పరంగా ధరణి సమస్యలు చాలావరకు అపరిష్కృతంగా ఉన్నాయి. పట్టణాలు, గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుధ్యంతోపాటు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై నిత్యం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటనలు చేపడుతున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పర్యవేక్షిస్తున్నారు. పాలనాపారంగా నిర్లక్ష్యం, అలసత్వం వహించే సిబ్బందితోపాటు అధికారులపై తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు అధికారులను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రజలనుంచి వచ్చే అర్జీలను స్థానికసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులకు అందించేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలపై జిల్లా అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీచేశారు. ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం గతప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల పురోగతిపై అధ్యయనం చేస్తోంది. అయితే అసంపూర్తిగా ఉన్న పనులపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయి నివేదికలు రూపొందించాలని సూచిస్తున్నారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సకాలంలో విధుల్లోకి చేరుకోవాలని అల్టిమేటం జారీచేశారు. ఇటీవల కలెక్టర్ రామన్నపేట గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. రానున్న రోజుల్లో సంక్షేమ వసతిగృహాలతోపాటు వైద్యశాలలను కూడా సందర్శించనున్నారు. రోగులకు అందుతున్న సేవలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ఇటీవల వానాకాలంలో సీజన్ వ్యాధుల నియంత్రణపై వైద్యశాఖఅధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగినచర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రత్యేకాధికారులపై పర్యవేక్షణ

జిల్లాలో 17 మండలాలు, 421 గ్రామపంచాయతీలు, ఆరుమునిసిపాలిటీలున్నాయి. ప్రస్తుతం జడ్పీ,మండల పరిషత్‌ల పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ అదనపు బాధ్యతలు తీసుకున్నారు. అదేవిధంగా మండల పరిషత్‌లకు, గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. గ్రామాల్లో పరిపాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ... స్థానిక సంస్థల పాలనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అధికారుల పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారించాల్సిన అంశాలపై నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారులతో వారానికోసారి టెలీకాన్ఫరెన్స్, వీడియో, గూగుల్ మీట్‌లలో పర్యవేక్షిస్తున్నారు.

ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి'లో జిల్లావ్యాప్తంగా ధరణి సమస్యలే అధికంగా వస్తున్నాయి. రైతుల భూములు వేరే వారి ఖాతాకు వెళ్లడం, పేరు తప్పుగా పడటం, సర్వే నెంబర్లు మార్పులు కావడంతోపాటు, భూమి ఉండి కూడా లేని వారిగా మారిపోయారు. జిల్లాలో దాదాపు 7,500కుపైగా 'ధరణి' సమస్యలున్నాయి. ఈ నేపథ్యం లో రెవెన్యూ రికార్డులు పెద్దఎత్తున తారుమారుకావడంతో జిల్లాయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కోర్టు కేసులు ఉన్న భూములు కాకుండా... జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పరిష్కరించాల్సి న దరఖాస్తులన్నీ పూర్తిచేసేందుకు ప్రత్యేక కా ర్యాచరణ రూపొందించారు. క్షేత్రస్థాయికి వె ళ్లి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్ షాలోమ్ కూడా నిత్యం తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీచేసి, ధరణి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులు ధరణిలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు టెలీ, వీడియో, గూగుల్ మీట్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు.



కార్మికుల కళాత్మక నైపుణ్యం ప్రశంసనీయం

కోల్ ఇండియా జనరల్ మేనేజర్ల బృందం

భూదాన్‌పోచంపల్లిలో పర్యటించిన సభ్యులు




చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరల డిజైన్లను పరిశీలిస్తున్న కోల్ ఇండియా జనరల్ మేనేజర్ల బృందం

భూదాన్‌పోచంపల్లి, జూలై 10: భూదాన్‌పోచంపల్లి చేనేత కార్మికుల కళాత్మక నైపుణ్యం ప్రశంసనీయమని కోల్ ఇండియా జనరల్ మేనేజర్ల బృందం అభినందించింది. హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 'అస్కి' ఆధ్వర్యంలో బుధవారం కోల్ ఇండియా జనరల్ మేనేజర్ల బృందం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులు రూపొందించిన అద్భుతమైన డిజైన్లు, టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరలు ఎంతో అందంగా ఉన్నాయన్నారు. 17మంది గల బృందం గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి స్థితిగతులను అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. అంతకుముందు పట్టణంలోని చేనేత కార్మికుల ఇళ్లు, మగ్గాలను పరిశీలించారు. పోచంపల్లి చేనేత సహకార సంఘాన్ని పరిశీలించి, చేనేత కార్మికులకు ప్రభుత్వపరంగా అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. రూరల్ టూరిజం సెంటర్ సందర్శించి మ్యూజియంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ విల్సా, నిజాం కాలేజీ ప్రొఫెసర్ తడక యాదగిరి పాల్గొన్నారు.

కొండపై సదుపాయాల కల్పనకు కృషి

సాధారణ భక్తులకోసం ఆలయంలో క్యూలైన్

సమీక్షలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిక్షేత్రంలో విప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలుకుతున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 10: యాదగిరికొండపై స్వామి అమ్మవారలను దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులకోసం మరిన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కొండపైన బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆలయ అభివృద్ధికి సహకరిస్తూనే భక్తులకు అన్ని రకాల సౌకర్యాల కల్పిస్తామన్నారు. తిరుపతి తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. స్వామి అమ్మవారలను సాధారణ భక్తులు ఒక నిమిషంపాటు దర్శించుకునేందుకు వీలుగా ర్యాంపు ద్వారా సుమారు 50 మీటర్ల దూరం నుంచే క్యూలైన్ అందుబాటులోకి తెచ్చామన్నారు. తిరుపతి సంప్రదాయాన్ని ఇక్క డి ఆలయంలో కూడా ఏర్పాటు చేశామని, స్వామివారిని దగ్గరి నుంచి దర్శించుకునేందుకు అధికారులు ఆమోదయోగ్యంగా ఏర్పాట్లు చేశారని చెప్పారు. కొండపై పాత ఆచారాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొండపైన పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేదించామన్నారు. స్వామివారిని సాధారణ భక్తుడి కి మరింత దగ్గర కు చేర్చేందుకు అందరం కలిసి కట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతకు ముందు స్వామివారిని విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. సమావేశంలో ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు : చామల

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని రసాయన పరిశ్రమలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామస్థుల విజ్ఞ ప్తి మేరకు బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయా రసాయన పరిశ్రమలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 రోజుల్లో కంపెనీ యజమానులు పూర్తి నివేదిక సమర్పించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

20.2 కోట్ల మొక్కలు నాటేందుకు నిర్ణయం

యాదగిరిగుట్ట రూరల్: రాష్ట్రవ్యాప్తంగా 20.2 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం గుట్ట మండలం వంగపల్లి గ్రామంలో వన మహోత్స కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని, పల్లెపచ్చగా ఉండాలంటే ప్రతీఒక్కరు మొక్కలు నాటాల్సిందేనన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేక నిధులు కేటాయించారని, వాటిని మహిళలు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అధికారులు కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలని, అలా పనిచేయడానికి వీలు కాదంటే వారికి నచ్చిన ప్రాంతానికి బదిలీ చేస్తామని, అంతేతప్ప విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరి, విద్యర్థులు ఇబ్బంది పడుతున్నారని, పాఠశాలకు నిధులు కేటాయించాలని కోరుతూ అయిలయ్యకు టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ రేగు బాలనర్సయ్య వినతిపత్రం అందజేశారు. అదే విధంగా వంగపల్లి గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించాలని గ్రామస్థులు కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : జడ్పీ సీఈవో

మోటకొండూరు, జూలై 10: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జడ్పీ సీఈవో శోభారాణి హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. వన మహోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ అవరణలో మొక్కలు నాటారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరా, సూపరింటెండెంట్ యశోద, ఎంపీవో కిషన్, ఏపీవో అరుణ, సాయికుమార్, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో యువకుల వేధింపులతో ఆత్మహత్య

మాడ్గులపల్లి, జూలై 10: ఒకే వీధిలో ఉండే ఇద్దరు యువకులు ఓ యువతిని పెళ్లి చేసుకోవాలని ఒకరు, ప్రేమించాలని మరొకరు వేధించారు. తాము చెప్పినట్లుగా వినకపోతే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో యువతి ఫొటోలను పెడతామని బెదిరించడంతో ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శోభన్‌బాబు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం కుక్కడం ఆవాసం చింతలగూడెం గ్రామానికి చెందిన కొత్త రామలింగం రజిత దంపతులకు కుమారుడు, కుమార్తె కల్యాణి(18) ఉన్నారు. కల్యాణి పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. ఆమె స్వగ్రామంలో ఉండే వీధిలోనే ఉండే ఆరూరి శివ, కొమ్మనబోయిన మధులు కల్యాణిని ఇష్టపడుతున్నారు. వీరిద్దరూ స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట కల్యాణి ఫోన్‌నెంబరును తెలుసుకున్న వారిద్దరూ ఆమెకు తరచూ ఫోన్లు చేయడం ప్రారంభించారు. ఊరితో పాటు వీధిలో ఉండేవారే కావడంతో ఆమె వారితో మాట్లాడుతోంది. దీనిని అలుసుగా తీసుకున్న శివ తనను ప్రేమించాలని, మధు తనను పెళ్లి చేసుకోవాలని అడుగుతున్నారు. ఇందుకు కల్యాణి నిరాకరిస్తుండటంతో వాట్సాప్‌లో ఆమె డీపీగా(డిస్‌ప్లే పిక్చర్) పెట్టుకున్న ఫొటోలను తీసుకుని వాటిని తమ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరిస్తున్నారు. ఇద్దరు యువకుల వేధింపులతో మనోవేదనకు గురైన కల్యాణి ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. కొద్దిసేపటికి స్థానికులు గమనించి మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తల్లి రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని నల్లగొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. స్వగ్రామంలో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. తమ కుమార్తె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా నిందితులు శివ, మధులు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామన్నారు. కల్యాణి మృతదేహాన్ని సందర్శించిన మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి మృతి పట్ల పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ సర్పంచ్ అలుగుబెల్లి గోవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ, నాయకులు పాదూరి గోవర్ధని, రాబర్ట్, నకిరేకంటి శ్రీను, వెంకన్న, వేణు, మారయ్య, నంద్యాల వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



రామలింగంను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కల్యాణి(ఫైల్‌ఫొటో)

కడుపు నొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి

నల్లగొండ క్రైం, జూలై 8 : కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. నల్లగొండ టూటౌన్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దవూర మండలం నాగార్జునపేటకు చెందిన రమావత్ ఇందూ(17) కట్టంగూరు కేజీబీవీలో ఇంటర్ బైపీసీ చదువుతోంది. రెండురోజుల నుంచి కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సకోసం తీసుకొచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబం మూడేళ్ల నుంచి నల్లగొండలోని శ్రీనివాసనగర్‌కాలనీలో నివాసముంటూ కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

చిట్యాల రూరల్, జూలై 10 : ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాక్‌లోని సీతారాంపేటకు చెందిన రామనాథం సాయిరామ్(28) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులు జమ్మన్న సంప్రీత్‌జోషి, తమ్మగోని చరణ్, డ్రైవర్ మీసాల వంశీ వినాయక్‌లతో కలిసి ఈ నెల 9న హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు కారులో వెళ్తున్నాడు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు టైరు పగిలి అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాయిరాంతో పాటు కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా సాయిరామ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి రామనాథం కాళిదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి ...



గరిడేపల్లి, జూలై 10: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన నాగార్జునపు మధు(36) మంగళవారం ఉదయం కోదాడ నుంచి మిర్యాలగూడకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో గరిడేపల్లి మండలం అప్పన్నపేట శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మధుకి గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మధు భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. మధుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లొంగిపోయిన మనీష్‌రెడ్డి

చింతపల్లి, జూలై 10 : మనీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వెయ్యికి రెండు వేలు, లక్షకు రెండు లక్షలు ఇస్తానంటూ రూ.50 కోట్లతో ఉడాయించిన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మదిని మనీష్‌రెడ్డి పోలీసులకు బుధవారం లొంగిపోయాడు. మొదట కొందరికి నమ్మకం కలిగేలా ఇచ్చిన మనీష్‌రెడ్డి ఆ తర్వాత చేతులెత్తేశాడు. బాధితులు డబ్బుల కోసం నిలదీయడంతో బ్రాంచ్ మూసేసి పోలీసుల వద్ద లొంగిపోయాడు.

ఆంధ్రజ్యోతి విజిట్

ఆరు వరుసలుగా హైదరాబాద్- విజయవాడ హైవే

ప్రమాదాల నివారణకు
ఫ్లైఓవర్లే పరిష్కారం

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- గతంలో తప్పులు జరగవద్దంటున్న ప్రజలు
- అండర్‌పాసింగ్‌లు, వీయూపీలు, ఫ్లైఓవర్లతో క్రాస్‌రోడ్ల సమస్యలకు పరిష్కారంగా సూచన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి(65)ని ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి మొదలై సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వరకు 151 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో హైవేను విస్తరించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక నిర్మాణాలతో పాటు సర్వీస్ రోడ్లను కూడా నిర్మించి ఇబ్బందులను తీర్చాలని సమీప గ్రామాల ప్రజల డిమాండ్ చేస్తున్నారు. జంక్షన్లు, క్రాస్‌రోడ్ల వద్ద ఫ్లైఓవర్లతో పాటు అండర్‌పాసింగ్‌లను ఏర్పాటు చేయాలంటున్నారు.




హైవే ప్రారంభం వద్ద చౌటుప్పల్ మండలంలో ఆంథోల్‌మైసమ్మ దేవాలయం

చౌటుప్పల్ టౌన్ / చౌటుప్పల్ రూరల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి యాదాద్రి భువనగిరి జిల్లాలో 23 కిలోమీటర్లు విస్తరించి ఉంది. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామసమీపంలోని 40వ కిలోమీటరు రాయి సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి నుంచి గుండ్లబావి గ్రామసమీపంలోని 63వ కిలోమీటరు రాయి వరకు ఉంటుంది. చౌటుప్పల్ పట్టణం మీదుగా వెళ్లే ఈ హైవేపై ఎల్లంబావి, లక్కారం గ్రామాల్లో ఫ్లైఓవర్లు, దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి ఆరులేన్లతో నిర్మించి ఉన్నాయి. వీటి పరిధిని తీసివేస్తే నిర్దిష్టంగా 20 కిలోమీటర్ల పొడవున ఆరు వరసలుగా విస్తరించవలసి ఉంటుంది.

రెండు ఆలయాలు, ఒకదర్గా

హైవే విస్తరణకు రెండు దేవాలయాలు, ఒక దర్గా అడ్డంకిగా ఉన్నాయి. దండు మల్కాపురం సమీపంలోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం, చౌటుప్పల్ పట్టణంలో దర్గా, ఎల్లంబావి గ్రామ సమీపంలో గణేష్ టెంపుల్ ఉన్నాయి. వీటిని పక్కకు కదిలించాల్సి రావడం ఇబ్బందితో కూడుకున్న పని.

దండు మల్కాపురం వద్ద...

ఆరులేన్ల విస్తరణతో వాహనాల వేగం పెరగనుంది. ఈ క్రమంలో పలు చోట్ల అండర్‌పాసింగ్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. నిత్యం వేలాది కార్మికులు రాకపోకలు సాగించే పారిశ్రామిక కారిడార్ దండుమల్కాపురం వద్ద బ్రిడ్జి అవసరం ఉంది. పారిశ్రామిక వేత్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కే సుధీర్‌రెడ్డి ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను కలిసి ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వినతిపత్రాలను అందజేశారు. ఈ సర్కిల్ వద్ద గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్, ఆంథోల్ మైసమ్మ దేవాలయం, దండు మల్కాపురం గ్రామం ఉంది. ఇక్కడి నుంచి దేవాలయానికి సుమారు 200 మీటర్ల పొడవున వ్యతిరేక మార్గంలో భక్తులు వెళ్తుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. కార్మికులు, ఉద్యోగులు, గ్రామస్థులు హైవేను దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ ఏర్పాటు ఎంతో అవసరం ఉంది.

అండర్‌పాసింగ్‌లు లేక

హైవేపై దండుమల్కాపురం, కైరతాపురం, ఎల్లగిరి, ధర్మాజీగూడెం, పంతంగి, ఆరెగూడెం గ్రామాలకు వెళ్లే దారుల వద్ద అండర్‌పాసింగ్‌లను నిర్మించాలని ప్రజలు పదేళ్లుగా కోరుతున్నారు.

చౌటుప్పల్‌లో భారీ ఫ్లైఓవర్

చౌటుప్పల్ పట్టణంలో 2.45 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి నుంచి పద్మావతి ఫంక్షన్ హాల్ వరకు నిర్మాణం జరగనుంది.ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి.

ఆరు లేన్ల విస్తరణతో పాటు సర్వీసు రోడ్లు నిర్మించాలి



హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని నిర్ణయించడం అభినందనీయం. ఆరు లేన్ల రోడ్డుతో పాటు జాతీయరహదారి మొత్తం సర్వీసు రోడ్లు, డ్రైనేజీ కాల్వలను నిర్మించాలి. ప్రమాద ప్రాంతాలలో పబ్లిక్ అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలి. రహదారిని గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా మార్చాలి.

● రిక్కల ఇందిరాసత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లగిరి

● భూసేకరణ అవసరం లేదు

హైవే విస్తరణకు భూసేకరణ అవసరం లేదు. 2009లో చేసిన నాలుగు వరసల రోడ్డు విస్తరణ సందర్భంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూసేకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా 100 మీటర్ల మేర భూమిని ప్రభుత్వం సేకరించింది. దీంతో ఆరు వరసలు రోడ్డు విస్తరణకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఆస్తుల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.



● పచ్చదనం కనుమరుగు

ఆరులేన్ల విస్తరణతో వేలాది చెట్లు నేలమట్టం కానున్నాయి. హైవే విస్తరణ నేపథ్యంలో చెట్లను తొలగించాల్సి ఉంది. హరితహారం కింద నాడు నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారి హైవేను పచ్చదనంతో నింపివేశాయి. మూడు వరసలలో పెరిగిన చెట్లలో రెండు వరసలను తొలగించవలసి ఉంటుంది.



చిట్యాల / చిట్యాల రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం రెడ్డిబావిగూడెం వరకు ఉన్న హైవే ఆ తర్వాత నుంచి నల్లగొండ జిల్లా చిట్యాల పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి వట్టిమర్తి క్రాస్‌రోడ్డు వరకు చిట్యాల మండల పరిధిలో సుమారు 21 కిలోమీటర్లక మేర విస్తరించి ఉంది. గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాల్లో ఆరు లేన్ల విస్తీర్ణంతో గతంలోనే బ్రిడ్జిలను నిర్మించారు. ప్రధానంగా గుండ్రాంపల్లి, సుర్కంటిగూడెం, వెలిమినేడు శివారు, పెద్దకాపర్తి, చిట్యాల జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్, వట్టిమర్తి క్రాస్‌రోడ్ ప్రాంతాలను ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను నిర్మించాల్సి ఉంది. అదేవిధంగా చిట్యాలలోని బస్టాండ్ సమీపం నుంచి ఎస్‌బీఐ కార్యాలయం వరకు ఫ్లైఓవర్ మంజూరు కాగా ఇటీవల మంత్రి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు.

వెలిమినేడు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారి విస్తరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆలయ నిర్వాహకులు, స్థానికులతో సమావేశమై తుది నిర్ణయానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.

ఎనిమిది లేన్లుగా విస్తరించాలి



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి. విపరీతమైన ట్రాఫిక్ ఉన్నందున భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎనిమిది లేన్లుగా విస్తరించాలి అలాగే మెట్రో రైలు వేయడం వల్ల హైవేపై ట్రాఫిక్ తగ్గుతుంది. చిట్యాలలో బైపాస్ నిర్మించాలి.

- కుక్కల మోహన్, చిట్యాల వాసి

ప్రమాదంగా మూలమలుపు



నార్కట్‌పల్లి: చిట్యాల మండలం వట్టిమర్తి దాటగానే మొదలై ఏపీ లింగోటం వరకు నార్కట్‌పల్లి మండలంలో హైవే సుమారు 10.7 కిలోమీటర్ల విస్తరించి ఉంది. నార్కట్‌పల్లి పట్టణంలో నుంచే కాకుండా బైపాస్‌గా హైవేని విస్తరించారు. నార్కట్‌పల్లి పట్టణం ప్రారంభం నుంచి కామినేని చివరి వరకు, ఆ తర్వాత ఏపీ లింగోటం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే అద్దంకి రాష్ట్ర రహదారికి పైనుంచి జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మించారు. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్లాల్సిన వాహనాలు ప్రస్తుతం ఉన్న సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి నల్లగొండ వైపునకు తిరిగే సమయంలో కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

రింగ్ రోడ్డును నిర్మించాలి

నల్లగొండ ఫ్లైఓవర్ వద్ద రింగ్ రోడ్డును నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. కామినేని నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా నార్కట్‌పల్లి పట్టణం వైపునకు వచ్చే క్రమంలో ఫ్లైఓవర్ కింద నుంచి కుడి వైపునకు వెళ్లాల్సిన సమయంలో ఇటు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుతో పాటు నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే వాహనాలు అటు నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు హైవేపైకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డుపైకి ఎక్కే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ ప్రదేశాన్ని విస్తరించి రింగ్‌రోడ్డు వేయడం ద్వారా ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

'రోటరీ'రోడ్డు ప్రతిపాదనలను పరిశీలించాలి

నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే దారిలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద 'రోటరీ రోడ్డు'ను ఏర్పాటుచేసేందుకు గతంలో జీఎంఆర్ సంస్థ ప్రతిపాదనలు పంపగా జాతీయ రహదారి సంస్థ నిరాకరించింది. కామినేని ఆసుపత్రి సమీపంలోని వైజంక్షన్ వద్ద పదుల సంఖ్యలో మృత్యువాత పడగా ఈ ప్రదేశాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు హైదరాబాద్ ఓఆర్ఆర్ వద్ద ఉన్నట్టుగానే 'రోటరీ' రోడ్డును నిర్మించేందుకు జీఎంఆర్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు అప్పట్లో అంగీకారం లభించలేదు. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన కామినేని ఆసుపత్రి వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జికే ఆమోదం తెలిపి నిర్మించారు. ఐతే ప్రస్తుతం ఆరులేన్ల విస్తరణ పనుల్లో భాగంగా నార్కట్‌పల్లి బ్రిడ్జి వద్ద రోటరీ రోడ్డు ఏర్పాటు అంశం మరోసారి పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలంలో చందంపల్లి గ్రామం నుంచి కేతేపల్లి మండలం ఇనుపాముల జంక్షన్ వరకు మూడు కిలోమీటర్ల దూరం హైవే రోడ్డు ఉంటుంది. నకిరేకల్ బైపాస్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ నుంచి నకిరేకల్ పట్టణానికి వాహనాలు రావాల్సి ఉంది. ఈ రెండు జంక్షన్ల వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు లేన్ల రోడ్డు విస్తరణ ఏర్పాటు చేస్తే సుమారు అర కిలోమీటర్ దూరం నకిరేకల్‌లోని చీమలగడ్డ ప్రాంతంలో నాలుగు లేన్ల పక్క ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం కానున్నాయి. అదేవిధంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాఫీగా జరుగుతుంది.

కేతేపల్లి : నకిరేకల్ పట్టణ శివారు నుంచి మూసీ నది పక్కన గల ఉప్పలపహాడ్ గ్రామం వరకు కేతేపల్లి మండలంలో దాదాపు 13 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. ఈ హైవేపై ఇనుపాముల-నకిరేకల్ పట్టణాల మధ్య గల జంక్షన్ బ్లాక్‌స్పాట్‌గా ఉంది. అలాగే కొర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాల వద్ద గల జంక్షన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ జంక్షన్‌ల వద్ద స్థానిక ప్రజానీకం కాలినడక వెళ్లడం, జీవాలు, పశువులు రోడ్డు దాటడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. అన్ని గ్రామాల్లో అండర్ పాసింగ్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. దీంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు హైవేపై మీదకు వెళ్లడం కుదరదు. దూర ప్రాంతాలకు అత్యంత వేగంగా వెళ్లే వాహనాలకు సైతం గ్రామాల వద్ద ఎలాంటి అడ్డంకులు లేకుండాపోనున్నాయి.

ప్రమాదాలకు జంక్షన్ కట్టంగూరు

కట్టంగూరు: నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం దాటిన తర్వాత నుంచి అయిటిపాముల శివారు వరకు హైవే కట్టంగూరు మండలపరిధిలోకి వస్తుంది. సుమారు 17 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కట్టంగూరు శివారు నల్లగొండ క్రాస్‌రోడ్ జంక్షన్ ప్రమాదాలకు జంక్షన్‌గా మారింది. ఈ ప్రదేశం వద్ద వెహికల్ అండర్ పాస్‌ను నిర్మించాల్సి ఉంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలకు తోడుగా నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి వచ్చే వాహనాలు ఈ జంక్షన్ వద్దే కలుస్తాయి. దీంతో ఈ జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రదేశం వద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుచేసినా గాని ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకోసం ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు అదేవిధంగా సర్వీసు రోడ్లను పూర్తి చేయాల్సి ఉంది. ఇదిలా ఉడగా ముత్యాలమ్మగూడెం, కట్టంగూరు, అయిటిపాముల బ్రిడ్జిల కిందట ఏర్పాటుచేసిన పీయూపీలను వీయూపీలుగా మార్చాల్సిన అవసరముందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా కట్టంగూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పీయూపీ చాలా ఇరుకుగా ఉండటంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఇదే విషయమై గ్రామానికి చెందిన ప్రజలు అనేకసార్లు రహదారిపై రాస్తారోకో చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరిస్తున్న క్రమంలో పీయూపీని విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు.


కట్టంగూరు శివారులోని నల్లగొండ క్రాస్‌రోడ్డు

అండర్‌పాసింగ్‌తో పరిష్కారం



కట్టంగూరు శివారులోని జంక్షన్ వద్ద అండర్‌పాసింగ్ ఏర్పాటుతోనే సమస్యకు పరిష్కారం. వీయూపీని నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చు. ఈ ప్రదేశం వద్ద రింగురోడ్డు నిర్మించినా ప్రమాదాలను నివారించలేం. దీంతో పాటు కట్టంగూరులో పీయూపీలను కూడా వెడల్పు చేయాలి.

- గట్టిగోర్ల సత్తయ్య, మాజీ ఎంపీటీసీ కట్టంగూరు



అమ్మో.. జనగాం జంక్షన్

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామం దాటిన తర్వాత సూర్యాపేట జిల్లా పరిధిలోకి హైవే వెళ్తుంది. సూర్యాపేట పరిధిలోని రాయినిగూడెం నుంచి దురాజ్‌పల్లి వరకు 10 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. సూర్యాపేట పట్టణం కొత్త బస్టాండ్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వరకు ఆరు లేన్ల బ్రిడ్జి నిర్మించారు. పిల్లలమర్రి, జనగాం ఎక్స్‌రోడ్డు, దురాజ్‌పల్లి వద్ద ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఆయాచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రధానంగా జనగాం క్రాస్‌రోడ్డు వద్ద వందలసంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రాత్రివేళ రోడ్డు దాటుతున్న పాదచారులతో పాటు వాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. రాత్రివేళ ఇక్కడ రోడ్డుదాటడం అంటేనే ప్రజలు భయపడుతుంటారు. సూర్యాపేట పట్టణం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కిలోమీటర్ సర్వీస్ రోడ్డు నిర్మిస్తే మూడు టౌన్‌షిప్‌లతో పాటు కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు ఎటువంటి భయాందోళన లేకుండా ప్రయాణం చేయవచ్చు. కిలోమీటరు దూరంలో ఉన్న టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ప్రజలు, కేటీఅన్నారం, కుప్పిరెడ్డిగూడెం గ్రామస్తులు రాత్రి పూట కొద్ది దూరమేనని రాంగ్ రూట్‌లో రావడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దురాజ్‌పల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సిఉంది. ప్రస్తుతం నేరేడుచర్ల రహదారి వైపునకు వాహనాలు మళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదేకాక జమ్మిగడ్డ సబ్‌స్టేషన్ దగ్గర ఉన్న జాతీయ రహదారి కుడి వైపు నుంచి కేవలం అరకిలోమీటర్ లోపు రోడ్డు నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగర్, విజయకాలనీ, దాసాయిగూడెం, ఇమాంపేట, బలరాంతండా, దుబ్బతండా, వస్రాంతండా, లేఖ్యతండా, ఇండస్ట్రీయల్ ఏరియాలో పనిచేసే కార్మికులు ఎఫ్‌సీఐలో పనిచేసే కార్మికులకు వెసలుబాటుగా ఉంటుంది.


దురాజ్‌పల్లి జంక్షన్

చివ్వెంల : సూర్యాపేట పట్టణ శివారు దాటిన తర్వాత చివ్వెంల మండలంలో 12 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. వస్రాంతండా మొదలుకొని గుంజలూరు గ్రామం శివారు వరకు ఉన్న హైవేపై వస్రాంతండా వద్ద రహదారి నుంచి తండా వైపునకు వెళ్లేందుకు జంక్షన్ లేక వ్యతిరేకమార్గంలో వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఉండ్రుగొండ గ్రామ స్టేజీ వద్ద కాకుండా కొంచెం దూరంగా జంక్షన్ ఏర్పాటు చేయడంతో వ్యతిరేక మార్గంలో గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తుల్జారావుపేట గ్రామ స్టేజీ వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గుంపుల వద్ద మరో జంక్షన్ ఏర్పాటుచేస్తే గ్రామస్థులకు ఇబ్బందులు తీరుతాయి. వస్రాంతండా, దురాజ్‌పల్లి, ఉండ్రుగొండ, పెద్దగట్టు లింగమంతులస్వామి దేవస్థానం నుంచి కాసీంపేట వరకు, తుల్జారావుపేట గ్రామాల వద్ద సర్వీసు రోడ్లతో పాటు ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ముద్దులచెర్వు వద్ద అండర్‌పాస్ నిర్మించాల్సిన ప్రదేశం

మూలమలుపులతో, మూగజీవాల రాకతో, క్రాస్‌రోడ్లతో మునగాల మండలంలో హైవే ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. మృతుల్లో నందమూరి జానకిరాంతో పాటు ఏపీకి చెందిన ఎస్పీ, ఇతరులు ఉన్నారు. మునగాల మండల పరిధిలోని హైవేలో సుమారు 16కు పైగా మూల మలుపులు ఉన్నాయి. ఆరులేన్ల విస్తరణలో ఈ మలుపు లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనచోద కుడు అలసిపోయేలా ఈ మార్గంలో ప్రయాణం ఉంటుంది.

మునగాల: మండలంలోని కొమరబండ తర్వాత కోదాడ మండలం కట్టకొమ్ముగూడెం నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వద్దకు హైవే విస్తరించింది. 10 కిలోమీటర్ల విస్తరించి ఉన్న హైవేపై ఆరు లేన్ల కోదాడ పట్టణంలోని దొరకుంట గ్రామంలో ఆరులేన్ల రహదారి ఉంది.కట్టకొమ్ముగూడెం, రామాపురం క్రాస్‌రోడ్లను ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. కోదాడ మండలంలోని ద్వారకుండ జంక్షన్, జంక్షన్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టకొమ్ముగూడెం రోడ్డు, అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరంగపురం, శ్రీరంగపురం నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న దుర్గపురం జంక్షన్, జంక్షన్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోఉన్న చిమిర్యాల, చిమిర్యాల స్టేజీ నుంచి కిలోమీటర్ దూరంలోని నల్లబండగూడెం, అక్కడ నుంచి మరో కిలోమీటరు దూరంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాగా కట్టకొమ్ముగూడెం రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉందని, మిగతా స్టేజీల్లో అండర్‌పాస్‌లను నిర్మిస్తే ప్రమాదాలు జరగవని వాహనదారులు పేర్కొంటున్నారు.

కోదాడ: చివ్వెంల మండలం గుంజలూరు దాటిన తర్వాత మునగాల మండలంలోకి హైవే ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి కొమరబండ బైపాస్ వరకు సుమారు 25 కిలోమీటర్ల హైవే విస్తరించి ఉంది. మాధవరం, తాడ్వాయి, ముద్దులచెర్వు, కలకోవ, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. మునగాల, బరాకత్‌గూడెం వద్ద ఇప్పటికే ఆరు లేన్ల బ్రిడ్జిలు ఉన్నాయి. మాధవరం వద్ద యూటర్న్ లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మాధవరం నుంచి నాలుగు మీటర్ల దూరంలో ఉన్న ముద్దులచెర్వు, తాడ్వాయి, కలకోవల క్రాస్‌రోడ్ల వద్ద, అక్కడ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మునగాల పట్టణంలోని క్రాస్‌రోడ్డు, అక్కడి నుంచి ఐదు మీటర్ల దూరంలో ఉన్న ముకుందాపురం క్రాస్‌రోడ్డు, ఆ తర్వాత మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆకుపాముల క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా అండర్‌పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల అభిప్రాయాలు తీసుకోవాలి



హైవేపై అవసరమైన చోట అండర్‌పాసింగ్‌లు నిర్మిస్తే ప్రమాదాలను నిరివారించవచ్చు. ఆరు లేన్ల విస్తరణ సందర్భంగా రహదారి వెంట గ్రామస్థుల అభిప్రాయాలను తీసుకోవాలి. ఖమ్మం-సూర్యాపేట రహదారి విస్తరణలా చేపడితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. జాతీయరహదారిపై ఉన్న ప్రతీ గ్రామం వద్ద తప్పనిసరిగా అండర్‌పాసింగ్‌లు నిర్మించాలి.

- కనగాల నాగేశ్వరరావు, కోదాడ



రామాపురంలో రింగ్‌రోడ్డు కావాలి

కోదాడ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో చివరి ప్రాంతం హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఉన్న కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు. ఇక్కడ రింగ్‌రోడ్డు నిర్మించాలని స్థానికులు రోడ్డు విస్తరణ సమయంలోనే పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ వీలుకాలేదు. అప్పటి నుంచి ఈ ప్రాంతం నాలుగు కూడళ్ల ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. నిత్యం సుమారు 10కి పైగా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగడంతో పాటు అనేక మంది మృత్యువాతకు గురవుతున్నారు. సమీపంలోని సిమెంట్ పరిశ్రమలకు సంబంధించి వందలాది లారీలు ఈ రహదారి వెంటే వెళ్తుంటాయి. దీంతో రద్దీ ఉంటుంది. ఇటీవల మూడు నెలల్లో జరిగిన 13 రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా ఆరు లేన్ల విస్తరణలో భాగంగా రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద భారీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు సమాచారం.

రింగ్ రోడ్డు అవసరం



ఆరులేన్ల హైదరాబాద్-విజయవాడ రహదారిని ప్రమాదరహితంగా నిర్మించాలి. గతంలో జరిగిన సాంకేతిక సమస్యలకు ఆస్కారం ఇవ్వొద్దు. రహదారి వెంట గ్రామీణ ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా రింగ్‌రోడ్డు, సర్వీసు రోడ్లు నిర్మించాలి.

- కమతం వెంకటయ్య, రైతు

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక డిమాండ్స్‌డే
● తహసీల్దార్ కార్యాల ఎదుట వివిధ రంగాల కార్మికుల నిరసన



భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

భువనగిరి టౌన్, జూలై 10: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను మార్చుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరు రమాకుమారి అన్నారు. కార్మిక డిమాండ్ డేను పురస్కరించుకొని బుధవారం భువనగిరిలో సిఐటీయూ కార్మిక సంఘాల ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులను మోసం చేస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓదారు రాంచందర్, రాములు, ఆడెపు వెంకటేశ్, హనుమంత్, అంగన్వాడీలు, పద్మాబాయి, రుక్మిణీ, భాగ్య, భువనేశ్వరి, లక్ష్మి, కలమ్మ, రాధిక, చంద్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.

అడ్డగూడూరు : దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలను అణచివేతకు గురిచేస్తూ, వారి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యారని సీఐటీయూ మండల నాయకులు బుర్ర అనిల్ అన్నారు. తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించి, డీటీకి వినతి పత్రం అందజేశారు.

బీబీనగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీంలను ప్రైవేటీకరణ చేయొద్దని కోరుతూ స్కీంవర్కర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ధనమ్మ, శోభారాణి, సునీత, బాలయ్య, పద్మ, అరుణ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎ) : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బిక్షం మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామపారిశుద్ధ్యం కోసం పనిచేసే గ్రామపంచాయతీ సిబ్బందికి మండలంలో దాదాపు 11 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ సఫియెద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.కిష్టయ్య, ఆర్.శ్రీను, ఎస్.రమేష్, బి.నర్సింహాచారి, సైదులు, రామచంద్రు, కవిత, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినం సందర్భంగా భూదాన్ పోచంపల్లి తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు కె సునంద, వసంత, జంగమ్మ, పారిజాత, బాలమణి, ఉమ, పద్మ, ప్రమీల, సరిత, పుష్ప, సునీత, అరుణ, శారద, జయమ్మ, శంకర్ పాల్గొన్నారు.

రామన్నపేట: అసంఘటిత కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి సరికాదని సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ లాల్ బహద్దూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు బందెల భిక్షం, నకిరెకంటి రాము, మంజూల, భద్రున్నీసా, సమత, వంగా మారయ్య, గాదె నరేందర్, స్వరూప, సుజాత, సాలయ్య, నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ ప్రభ్వుతాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీటీఐయూ నాయకులు బీరప్ప శ్రీను, నర్సిరెడ్డి, జంగయ్య, రైతు సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి: ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొక్కొండ లింగయ్య, అంగన్‌వాడి టీచర్స్ జ్యోతి, శ్యామల, సునీత, జ్ఞానమ్మ, కల్పన, పద్మ, శాంతి, లావణ్య , శారద, స్వప్న, వరలక్ష్మి, విజయ, అండాలు, పోచమ్మ పాల్గొన్నారు.

రాజాపేట: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాజాపేట మండల తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. మండల తహసీల్దార్‌కు దామోదర్‌కు వినతిపత్రన్ని అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, భారతి, చంద్రకళ, దేవిక, మాధవి, రజిత, మహలక్ష్మీ, సుజాత, స్వప్న, శోభారాణి పాల్గొన్నారు.


ఆత్మకూరు(ఎం): తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు,



రామన్నపేటలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఇతర సంఘాల నాయకులు



తుర్కపల్లి: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎకరాకు రూ.80లక్షల పరిహారం ఇవ్వాలి


ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 10 : గౌరెల్లి నుండి భద్రాచలం జాతీయ రహదారి నిర్మాణంలో భూమి కోల్పోతున్న మండల పరిధిలోని వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన భూనిర్వాసిత రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం న్యాయంగా చెల్లించాలని, ఎకరాకు రూ.80లక్షలు చెల్లించాలని కోరుతూ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డిలకు వినతి పత్రాన్ని అందజేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచు సామ రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు సుర్వి కాటమరాజు, రైతులు పి.జంగారెడ్డి, ధర్మారెడ్డి, రంగారెడ్డి, బుచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్తిరెడ్డి, లింగారెడ్డి, రాంరెడ్డి, కళమ్మ పాల్గొన్నారు.

● గౌరెల్లి నుంచి భద్రాచలం వరకు నూతనంగా నిర్మించే జాతీయ రహదారి నిర్మాణంలో భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి జాతీయ రహదారి నిర్మాణంలో భూ నిర్వాసితులైన వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి గ్రామాలకు 55 మంది రైతులతో సమీక్ష నిర్వహించారు. వంకమామిడి గ్రామంలో 20 ఎకరాల 20 గుంటల భూమి, ధర్మారెడ్డిపల్లి గ్రామంలో 16 ఎకరాల 14 గుంటల భూమి కోల్పోతున్న నేపథ్యంలో బాధిత రైతుల అభిప్రాయాలను సేకరించి వారి అభ్యర్థనలను నివేదిక ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. అయితే రైతులు కనీసం ఎకరాకు రూ. 80 లక్షలు చెల్లించాలని కోరగా ప్రభుత్వ పరంగా ఎంత చెల్లిస్తారనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు ప్రభుత్వం నిర్ధారించిన మేరకు ఎకరాకు కనీసం రూ. 24 లక్షల వరకు ప్రభుత్వం చెల్లించేందుకు సిద్ధంగా ఉందని ఆర్డీవో రైతులకు చెప్పారు. మూసీ పరివాహకమైన ఈ ప్రాంత రైతులకు వ్యవసాయాధారిత భూమి కోల్పోతున్నామని తమకు కనీసంఎకరాకు రూ. 80 లక్షలు చెల్లించేందుకు ఒప్పించాలని రైతులు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సామ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచు సామ రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు కాటమరాజుగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గుండాల: గుండాల పోలీస్‌స్టేసన్ ఎస్ఐగా సైదులు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ యాకన్న మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా బాలాపూర్ నుంచి సైదులు బదిలీపై వచ్చారు.

చౌటుప్పల్ టౌన్ : మునిసిపాలిటీలోని లింగోజీగూడకు చెందిన వీఆర్ఏ కడారి అంజయ్య కుటుంబానికి కౌన్సిలర్ బండమీది మల్లేశం రూ.10వేలు సాయం చేశారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.రాజు డిమాండ్ చేశారు. భువనగిరి లో ఈ నెల 14, 15 తేదీలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల కరపత్రాలను స్థానిక జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు.

సంస్థాన్ నారాయణపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు చేయూత అందిస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని సర్వేల్ గ్రామ పరిధిలోని మర్రిగూడెం, కొత్తకాలనీ గ్రామ ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలమల్ల కృష్ణారెడ్డి సొంత నిధులు వెచ్చించి నిర్మించ తలపెట్టిన వాటర్ ప్లాంట్ , షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండల గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నోముల స్వామి, అధ్యక్షుడిగా కూరెళ్ల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రపెల్లి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడిగా రాగటి శ్రీను, సహయ కార్యదర్శిగా కూరెళ్ల సైదులు, కోశాధికారిగా సుదగాని రమేష్‌ను ఎన్నుకున్నారు.

రాజాపేట: విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించుకుని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ మదన్‌మోహన్ కోరారు. మండలంలోని దూదివెంకటాపురం ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల సమస్యలు పరిష్కరించాలి

● 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి


ఏడీఈ బాలూనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మోత్కూరు, జూలై 10: మోత్కూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో 33కేవీ ఆన్ అఫ్ స్విచ్‌లు, 11కేవీ ఏబీ స్విచ్‌లు, బ్రేకర్లు సక్రమంగా పనిచేయక పోవడంతో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన 1104 యూనియన్ గుండాల సెక్షన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గుండాల పట్టణ విద్యుత్ లైన్, రూరల్ విద్యుత్ లైన్ పక్కపక్కనే దగ్గరగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఒక లైన్‌లోని విద్యుత్ స్తంభాలపై పట్టణ విద్యుత్ లైన్, వ్యవసాయ బావులు విద్యుత్ లైన్ ఉండటంతో నెల క్రితం ప్రమాదం జరిగిందన్నారు. అయినా అధికారులు విద్యుత్ లైన్లు మార్చడం లేదని, విద్యుత్ లోపాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పని చేయని పరికరాలకు మరమ్మతు చేయడంతో పాటు అవసరమైనచోట నూతన ఏబీస్విచ్‌లు బిగించాలని, ఇతర విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోత్కూరులో ఏడీఈ బాలూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. 1104 యూనియన్ మోత్కూరు సబ్‌డివిజన్ లీడర్ గొడిశాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి ఎస్.అమర్‌నాథ్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంటు జై.వెంకటేశం, అదనపు కార్యదర్శి తిరుమలయ్య, భువనగిరి డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, మీర్జా షకీల్ బేగ్, టి.రమేష్‌రెడ్డి, అదనపు కార్యదర్శి బాబుగౌడ్, ముత్యం గోపయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య

మోత్కూరు, జూలై 10: చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ, సీపీఎం అనుబంధ చేనేత కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు పాశికంటి లక్ష్మీనర్సయ్య, గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. మోత్కూరు పద్మశాలి కాలనీలో నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. 'మగ్గం నడవాలి-నేతన్న బతకాలి, నేతన్నకు చేయూతనిద్దాం' అన్న నినాదంతో ఈ నెల 7న ప్రారంభించాల్సిన నేతన్న పోరుయాత్రను చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ మేరకు వాయిదా వేశామన్నారు. మంత్రి నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కమిషనర్ శైలజా రామయ్యర్ చేనేత, పవర్‌లూమ్ కార్మిక సంఘాల నాయకులను ఇటీవల సచివాలయానికి పిలిచి పోరు యాత్ర వాయిదా వేసుకోవాలని కోరారని, తమకు కొంత సమయం ఇస్తే బడ్జెట్‌లో నిధులు కేటాయించి, చేనేత హామీలు అమలు చేస్తామన్నారని చెప్పారన్నారు. కార్మికులకు పని కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారని, బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో పోరు యాత్రను తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. మంత్రి, కమిషనర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు పసునూరు యాదయ్య, ఏలూరి మచ్చగిరి, రేగోటి శ్రీను, నారాయణ, చంద్రమౌళి, రాజారామ్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

భువనగిరి రూరల్, జూలై 10: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భువనగిరి పీఏసీఎస్ మాజీ సర్పంచ్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బీఎస్.తిమ్మాపురం జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు రచ్చ మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతి బదిలీలు అభిందన సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అనేక రకాలుగా పాఠాలు బోధించి, మంచి చెడులు నేర్పించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చడానికి అధ్యాపకుల కృషి మరువలేనిదన్నారు. పదో తరగతిలో గ్రామానికి చెందిన విద్యార్థులు మొదటి స్థానం రావడానికి కృషి చేసిన మీ సేవలను మరువలేనివన్నారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవన్నారు. బదిలీపై వెళ్లిన కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు, హైస్కూల్ చైర్మన్ ఉడుత సవిత, రిటైర్డ్ హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు యాకూబ్ చారి, అరుణ, లింగేశ్వర్, వెంకటేశ్వర్లు, నిర్మల, మాజీ హైస్కూల్ చైర్మన్ ఉడుత మహేందర్ పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని బుజిలాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసి బదిలీ అయి, వెళుతున్న ఉపాధ్యాయులు కె.స్వప్న, డి.శ్రీనివాస్, ఎం.ఆంజనేయులు, ఎం.కృష్ణయ్యను బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కష్టపడితేనే ఫలితం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీ నర్సింహారెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సూరోజు భాస్కరాచారి, చాతరాశి అంజయ్య, జె.సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో కాలయాపన

● 'రైతు భరోసా'కు కట్టుబడి ఉండాలి
● సత్యాగ్రహంలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 10: కాంగ్రెస్ కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తోందని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన రైతు సత్యాగ్రహం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఐదు గ్యారంటీల హామీల ప్రకారం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఏడు నెలలుగా ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతూ సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. వరి నాట్ల సీజన్‌లో వర్షాలు లేక రైతాంగం ఆవేదన చెందుతుండగా రైతు భరోసా పేరుతో రైతుల ఖాతాల్లో చిల్లిగవ్వ జమ కాలేదన్నారు. డిసెంబరు 9వ తేదీన రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం నేటికి రుణమాఫీ చేయకపోగా సబ్‌కమిటీ ఎందుకని ప్రశ్నించారు. వరి కొనుగోలులో బస్తాకు రూ.500 బోనస్ ఇస్తానని అమలుకు నోచుకోలేదన్నారు. ఫసల్, పంటల బీమా అమలు కావడం లేదన్నారు. రైతు కూలీలకు రూ. 12,500, కౌలు రైతుకు రూ. 15,000 ఇస్తానన్న హామీ అమలు చేయలేదన్నారు. హామీల అమలు బీజేపీ ఈ నెల 8,9 తేదీల్లో మండల తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రం అందజేయగా, ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్‌ల ఎదుట ప్రజాస్వామ్యబద్ధంగా సత్యాగ్రహం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రానున్న పది రోజుల్లో రుణమాఫీ చేయకుంటే ప్రత్యక్ష యుద్ధం ప్రకటిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగారెడ్డి, చందుపట్ల వెంకటేశ్వరరావు, వేముల అశోక్, చంద్రశేఖర్, డి.లక్ష్మీనారాయణ గౌడ్, రంగారెడ్డి, పట్నం శ్రీనివాస్, రత్నపురం బలరాం, వైజయంతి, రాజు కాలభైరవ, బొల్లు నరసింహ యాదవ్, రాములు, మాణిక్యం రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.



ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, భాస్కర్

ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

భువనగిరి రూరల్, జూలై 10: ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని రోటరీ గవర్నర్ సోమవరపు రాంప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో క్లబ్ డైరెక్టర్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ సౌజన్యంతో బుధవారం భువనగిరి మండలం తాజ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేజ్ కమ్యూనిటీ వైర్‌లెస్ సీసీ టీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంపాల బుచ్చిరెడ్డి, ఎస్.నర్సింహాయాదవ్, సద్ది వెంకట్ రెడ్డి, కొండల్ రెడ్డి, గడ్డం జ్ఞాన్ ప్రకాశ్ రెడ్డి, ఉపేందర్, మాజీ సర్పంచ్ సురేశ్, ఉప సర్పంచ్ ర్యాకల సంతోష ఉన్నారు.

● సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించి సమాజ అభివృద్ధికి పాటుపడుతున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కృషి అభినందనీయమని రోటరీ గవర్నర్ రాంప్రసాద్ అన్నారు. భువనగిరి మండలం తాజ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రోటరీ డైరెక్టర్‌గా ఎన్నికై నిస్వార్థ సేవలందిస్తున్నందుకు గాను శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్, సురేష్, ఉపసర్పంచ్ ఆర్.సంతోష న్నారు.

మహిళా కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


శోభారాణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, జక్కలి ఐలయ్య

సంస్థాన్ నారాయణపురం జూలై 10: తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బండ్రు శోభారాణి కి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మహిళా సహకార అభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్యాలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యత తీసుకున్న శోభారాణికి శాలువా కప్పి పూలే బొకే ఇచ్చి సన్మానం చేశారు. కార్యక్రమంలో డీసీసీటీ మాజీ డైరెక్టర్ ఏర్పుల సుదర్శన్, నాయకులు కరెంటోతు బిక్షపతి నాయక్, మక్కెన అప్పారావు,పగడాల లింగయ్య, కాట్రోతూ సాగర్,నెట్టు శ్రీకాంత్, మాధవ్ పాల్గొన్నారు.

మా భూమి ఇతరుల పేరిట నమోదైంది


పురుగుల మందు డబ్బాతో ధర్నా చేస్తున్న రైతు దంపతులు

గుండాల, జూలై 10: తమ భూమి ఇతరుల పేరిట నమోదైందని, రికార్డుల్లో సరిచేయాలని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోవటంతో రైతు దంపతులు పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తంచేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈ సంఘటన జరిగింది. ఈ సందర్భంగా రైతు దంపతులు బొడ్డు మల్లయ్య, లింగమ్మ మాట్లాడుతూ గుండాల మండలం పెద్దపడిశాలకు చెందిన తమకు వారసత్వంగా సర్వే నెంబర్ 277లో 25గుంటల భూమి సంక్రమించిందని తెలిపారు. నాలుగేళ్ల క్రితం వరకు భూమి తమపేరుపైనే రికార్డులో ఉందన్నారు. గతంలో ఆర్ఎస్ఆర్(రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిస్టర్ లేదా ఫీల్డ్ సర్వే పర్ ల్యాండ్ రికార్డ్) సమస్య ఉందని అధికారులు తమ భూమిని రికార్డులో వేరే వ్యక్తుల పేరుపై ఎక్కించారని తెలిపారు. రికార్డుల్లో వారి పేరును తొలగించి, తిరిగి తమపేరుపై భూమిని నమోదు చేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ జలకుమారి మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి వారి భూమిపై విచారణ చేస్తామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దంపతులు ధర్నా విరమించారు.

ప్రతీ ఒక్కరు భగవద్గీతను పారాయణం చేయాలి

చౌటుప్పల్ టౌన్, జూలై 10: ప్రతీ ఒక్కరు భగవద్గీతను పారాయణం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సరోజినీదేవి ఉపదేశించారు. చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో బుధవారం సర్వేజనా సుఖినోభవంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువు పాలకుర్ల పాండు, యోగా సాధకులు ఎం.నీరజ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయానికి పాదయాత్ర

చౌటుప్పల్ టౌన్, జూలై 10: మెదక్ ఎంపీ రఘునందన్ రావు (బీజేపీ) గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌లోని పటాన్‌చెరువు నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి మొక్కు తీర్చుకునేందుకు చేపట్టిన ఆయన మిత్ర బృందం పాదయాత్రకు చౌటుప్పల్ పట్టణంలో బుధవారం బీజేపీ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, కౌన్సిలర్ పి.శ్రీధర్‌బాబు, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మల్లేశం, జి.సురేందర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ శాఖల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం 13న

చౌటుప్పల్ టౌన్, జూలై 10: చౌటుప్పల్ మండలంలోని టీడీపీ గ్రామ శాఖల అధ్యక్షులకు ఈ నెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మునుగోడు ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి హాజరవుతారని ఆయన వివరించారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్య, నాయకులు నల్ల పర్వతాలు, యాట వెంకటేశ్, పాశం రఘుపతి, గోవిందాచారి పాల్గొన్నారు.

స్కూటీని తప్పించబోయి..

చౌటుప్పల్ రూరల్, జూలై 10: చౌటుప్పల్ మండలం రెడ్డిబావి జాతీయరహదారిపై బుధవారం పెను ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న భారీ లారీ రెడ్డిబావి జాతీయరహదారిపై రోడ్డును క్రాస్ చేస్తున్న స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి డివైడరన్ ఢీకొట్టింది. డివైడరన్ ఢీకొన్న లారీ హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారును వెనుక భాగం నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డ్అయ్యాయి.

ఫోను పాయే.. పైసలు పాయే..

● బ్యాంక్ ఖాతా నుంచి నిధుల మళ్లింపు

భువనగిరి టౌన్, జూలై 10: పలు రూపకాల్లో సైబర్ క్రైం నేరగాల్లు నేరుగా బ్యాంక్ ఖాతాల నుంచే దోపిడీ చేస్తున్న క్రమంలో బుధవారం భువనగిరిలో కొత్త తరహాలో నిధులను కాజేసిన వైనం వెలుగు చూసింది. భువనగిరికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం తన స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అయితే ఫోన్ దొరికిన నేరగాళ్లు అదే ఫోన్ నుంచి రిక్వెస్టులు పెట్టి బ్యాంక్ యాప్ పాస్వర్డ్ మార్చుకుని రెండు దఫాలుగా అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.80వేలు దారి మళ్లించారు. అయితే డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లగా ఖాతా నుంచి డబ్బులు మాయమైనట్లు తెలిసింది. దీంతో ఫోన్ పోవడంతో పాటు నగదు కూడా బ్యాంకు ఖాతా నుంచి గల్లంతు కావడంతో బాధితుడు బుధవారం పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఫోను పోయిన వెంటనే సిమ్ నెంబర్, పిన్ నెంబర్లను, యాప్‌లను సీజ్ చేయించుకోవాలని లేని పక్షంలో బ్యాంక్ ఖాతాల్లోని నగదుకు భద్రత ఉండదని పట్టణ ఇన్స్‌పెక్టర్ కె.సురేష్‌కుమార్ సూచిస్తున్నారు.

ట్రాక్టర్ ఇంజన్ రోటోవేటర్ అపహరణ

భువనగిరి రూరల్, జూలై 10: ట్రాక్టర్ ఇంజన్, రోటావేటర్ అపహరణకు గురైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భువనగిరి మండలం నమాత్‌పల్లికి చెందిన జిట్టా రమేష్‌రెడ్డి మంగళవారం తన వ్యవసాయ బావి వద్ద టీఎస్ నెంబర్ హెచ్7956 గల తన ట్రాక్టర్‌తో వ్యవసాయ పొలాన్ని దున్నారు. కాగా రాత్రి అవడంతో ట్రాక్టర్ ఇంజన్, రోటోవేటర్‌లు అక్కడనే ఉంచి వెళ్లారు. బుధవారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వచ్చి చూడగా ట్రాక్టర్ ఇంజన్, రోటోవేటర్ అపహరణకు గురైనట్లు గమనించి చుట్టు ప్రక్కల ప్రదేశంలో వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ తెలిపారు.